# ప్రజల మాట ప్రగతి బాట

# బెల్లంపల్లి నియోజకవర్గం

### నాడు ఆవాసంలో అవస్థలు..నేడు గ్రామ పంచాయతీగా

# ప్రగతి పథంలో..

- అభివృద్ధిలో దూసుకెళ్తున్న నర్సాపూర్..
- రూ. 22లక్షలతో అభివృద్ధి పనులు



నర్సాపూర్ గ్రామం



గ్రామంలో సీసీ రోడ్డు




నర్సాపూర్‌లో పల్లె ప్రకృతి వనం




తెలంగాణ క్రీడా ప్రాంగణం



హరితహారంలో భాగంగా రోడ్డుకు ఇరు వైపులా పెంచిన చెట్లు

తాండూర్, అక్టోబర్ 17 : తెలంగాణ రాష్ట్రం రాక ముందు గ్రామ పంచాయతీల పరిధిలోని అనుబంధ గ్రామాలు దీనస్థితిలో ఉండేవి. ఆ గ్రామాలకు కనీసం నాయకులు గాని అధికారులు గాని వెళ్లే వారు కాదు. ప్రత్యేక రాష్ట్రమేర్పడ్డాక సీఎం కేసీఆర్ ఆవాస పల్లెలను గ్రామపంచాయతీలుగా మార్చడంతో అభివృద్ధిలో దిశగా సాగుతున్నాయి. తాండూర్ మండలంలో నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడి ప్రగతి పథంలో సాగుతున్న నర్సాపూర్ గ్రామంపై ప్రత్యేక కథనం.

నర్సాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో సుమారు 330 ఇండ్లు, 1120 మంది జనాభా, 720 మంది ఓటర్లున్నారు. ఈ గ్రామం కొత్తపల్లి గ్రామపంచాయతీలోని మారుమూల గ్రామంగా ఉండేది. ఈ గ్రామానికి వెళ్లడానికి గతంలో



వైకుంఠధామం

కనీసం రోడ్డు సైతం లేదు. అందుకే ఈ గ్రామానికి అధికారులు గాని ప్రజాప్రతినిధులు వచ్చేవారు కాదు. సమైక్య పాలనలో కొద్దిపాటి అభివృద్ధి నిధులు వచ్చినా కొత్తపల్లికి మరి కొన్ని గ్రామాలకే పరిమితమయ్యేది. ఆవాస గ్రామం కావడంతో చిన్నచూపు చూసేవారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ ఆవాస గ్రామాలన్నీ పంచాయతీలుగా చేయడంతో నర్సాపూర్ గ్రామపంచాయతీగా ఏర్పడింది. దీంతో ప్రభుత్వం, బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ప్రభుత్వ నిధులు నర్సాపూర్‌కు రూ.22లక్షలు మంజూరు చేశారు. పల్లె ప్రగతిలో భాగంగా చేపట్టిన పనులన్నీ పూర్తి చేశారు. పల్లె ప్రగతి ద్వారా రూ.12.50లక్షలతో వైకుంఠధామం, రూ.2.70లక్షలతో మూడు చోట్ల పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు, రూ. 2.50 లక్షలతో డంప్ యార్డు నిర్మించారు. రూ.1లక్షతో హరితహారం నర్సరీ, రూ4.30 లక్షలతో అంతర్గత రోడ్లు, సైడ్ డ్రైనేజీలు ఏర్పాటు చేశారు. రూ.5.20లక్షలతో ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్ కొనుగోలు చేసి ఎప్పటికప్పుడు గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించిన సిబ్బంది డంప్ యార్డుకు తరలిస్తున్నారు. హరితహారంలో భాగంగా రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కల రక్షణ కోసం ట్రీగార్డ్స్ ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీ పరిధిలో 78 మందికి వివిధ రకాల పింఛన్లు అందిస్తున్నారు. అందులో 33 మందికి వృద్ధాప్య పింఛన్లు 39 మంది వితంతువులు, ఐదుగురు దివ్యాంగులకు, ఒక ఒంటరి మహిళకు పింఛన్లు అందజేస్తున్నారు. ప్రభుత్వ నిధులతో అనేక అభివృద్ధి పనులు చేయడంతో గ్రామం పూర్తిగా స్వచ్ఛతగా మారింది.

**మారిన రూపురేఖలు...** పల్లె ప్రగతి కార్యక్రమంతో నర్సాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాల రూపురేఖలు మారిపోయాయి. గతంలో పారిశుధ్య సమస్యలతో గ్రామస్తులు ఇబ్బంది పడేవారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన పల్లె ప్రగతితో గ్రామం పూర్తిగా శుభ్రంగా మారింది. పంచాయతీ ట్రాక్టర్‌తో ప్రతి రోజూ ఇంటింటికీ తిరిగి తడి, పొడి చెత్తను సేకరించి డంప్ యార్డుకు తరలిస్తున్నారు. పల్లె ప్రగతి కార్యక్రమంతో గ్రామం ప్రగతిపథంలో ముందుకు సాగుతుండడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### ప్రత్యేక రాష్ట్ర పాలనలో పూర్తిస్థాయిలో అభివృద్ధి...



మా ఊరు కొత్తపల్లి గ్రామపంచాయతీలో పరిధిలో ఆవాస గ్రామంగా ఉన్నప్పుడు కనీసం రోడ్డు కూడా లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చేవారు కాదు. సీఎం కేసీఆర్ మా గ్రామాన్ని గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయడంతో ప్రత్యేక గుర్తింపు వచ్చింది. మా గ్రామాన్ని అభివృద్ధి చేసుకున్నాం. నేను నర్సాపూర్ తొలి సర్పంచ్‌గా గ్రామాన్ని అభివృద్ధి చేయడం ఆనందంగా ఉంది. పల్లె ప్రగతి ద్వారా ప్రకృతివనం, నర్సరీ, తెలంగాణ క్రీడా ప్రాంగణం, వైకుంఠధామం, డంప్ యార్డు, సీసీ, గ్రావెల్ రోడ్లు, సైడ్ డ్రైనేజీలు నిర్మించాం. సీఎం కేసీఆర్ పాలనలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సహకారంతో, పాలకవర్గం, గ్రామస్తుల భాగస్వామ్యంతో గ్రామాన్ని అభివృద్ధి చేశాం.

**-కుర్సెంగ జంగుబాయి, సర్పంచ్, నర్సాపూర్, తాండూర్**

### ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ అభివృద్ధి..



ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్నాం. ప్రభుత్వ నిధులు, ప్రజల సహకారంతో గ్రామం అభివృద్ధిలో ముందుకు సాగుతున్నది. పల్లె ప్రగతి కార్యాచరణ ప్రణాళికను పకడ్బందీగా నిర్వహించాం. గ్రామంలో ఇబ్బందులకు ఆస్కారం లేకుండా అన్ని వర్గాలతో సమష్టిగా కృషి చేస్తున్నాం.

**-సాదుల్లా, పంచాయతీ కార్యదర్శి, నర్సాపూర్, తాండూర్**

## అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్సే



ఎమ్మెల్యే చిన్నయ్యను శాలువాతో సన్మానిస్తున్న నాయకులు

బెల్లంపల్లి, అక్టోబర్ 17:రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్ పార్టీయేనని తాండూర్ జడ్పీటీసీ బానయ్య, సీనియర్ కౌన్సిలర్ గెల్లి రాజలింగు ధీమా వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీఆర్‌ఎస్ బీ ఫాం అందుకున్న సందర్భంగా మంగళవారం బెల్లంపల్లిలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఎన్నికలకు ప్రజలు సహకరించాలి

- డీసీపీ సుధీర్‌రాంనాథ్ కేకన్



నాయకుడిపేటలో మాట్లాడుతున్న డీసీపీ సుధీర్ రాంనాథ్‌కేకన్

కన్నెపల్లి, అక్టోబర్ 17 : రాబోయే అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని మంచిర్యాల డీసీపీ సుధీర్‌రాంనాథ్ కేకన్ పేర్కొన్నారు. మంగళవారం కన్నెపల్లి మండలంలోని నాయకుడిపేటలోని పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ప్రజలతో మాట్లాడారు. ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనలను పాటించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని, గ్రామాల్లో అందరూ కలిసి మెలిసి ఉండాలని, గొడవలు పడవద్దని పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీసీపీ వెంట ఏసీపీ సదయ్య, ఎస్ఐ నరేశ్, పోలీసులు ఉన్నారు.

**కాసిపేట మండలంలో..**

కాసిపేట, అక్టోబర్ 17 : కాసిపేట మండలంలోని మారుమూల గ్రామాలైన మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని పోలీస్ స్టేషన్లు, సోనాపూర్, వెంకటాపూర్, సాలేగూడ గ్రామాల్లో మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ పర్యటించారు. ప్రజలతో మాట్లాడి ఎన్నికలు సజావుగా సాగేందుకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఏసీపీ సీ సదయ్య, దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు పాల్గొన్నారు.

**భీమిని మండలంలో...**

భీమిని, అక్టోబర్ 17 : భీమిని మండలంలోని ఖర్జీభీంపూర్‌లో పోలింగ్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు ఉంటే సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలను పాటించాలన్నారు. డీసీపీ వెంట ఏసీపీ సదయ్య, ఎస్ఐప్రశాంత్ ఉన్నారు.

## సీ విజిల్ యాప్‌ను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్

బెల్లంపల్లి, అక్టోబర్ 17: ఎన్నికల కోడ్‌ను అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకునేందుకు ప్రతి ఒక్కరూ సీ విజిల్ యాప్‌ను వినియోగించుకోవాలని మంచిర్యాల సబ్ కలెక్టర్, బెల్లంపల్లి నియోజకవర్గ ఎన్నికల అధికారి రాహుల్ తెలిపారు. మంగళవారం రాత్రి తహసీల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాప్ పనితీరు వివరించారు. అక్టోబర్ 31 వరకు ఓటర్ నమోదుకు గడువు ఉందని తెలిపారు. రూ. 50వేల కంటే ఎక్కువ నగదు తో ప్రయాణించే వారు తప్పనిసరిగా తమతో రసీదు, ఆధారాలు ఉండాలని సూచించారు. దివ్యాంగులు, 80 ఏండ్లు పైబడిన వారు 12 డీ ఫాంను పూర్తి చేసి ఇవ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏడు మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

## పారిశుధ్య పనులు

వేమనపల్లి, అక్టోబర్ 17 : వేమనపల్లి మండల కేంద్రంలో మంగళవారం సర్పంచ్ కుబిడె మధుకర్ పంచాయతీ సిబ్బందితో పారిశుధ్య పనులు చేయించారు. రోడ్లు, మురుగు కాలువలను శుభ్రం చేయించారు. నీరు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. సేకరించిన చెత్తను పంచాయతీ ట్రాక్టర్‌లో డంప్ యార్డుకు తరలించారు. ప్రజలందరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

## దుర్గం చిన్నయ్య మళ్లీ గెలవాలని దుర్గమ్మకు పూజలు

నెన్నెల, అక్టోబర్17 : నెన్నెల మండలం అభివృద్ధి చెందాలంటే వచ్చే ఎన్నికల్లో బెల్లంపల్లి ఎమ్మెల్యేగా దుర్గం చిన్నయ్య భారీ మెజార్టీతో గెలవాలని కోరుతూ మండలంలోని ఆవుడం గ్రామంలో ఎంపీపీ సంతోషం రమాదేవి ఆధ్వర్యంలో దుర్గాదేవికి మొక్కులు చెల్లించారు. ఎమ్మెల్యేగా చిన్నయ్యను గెలిపించాలని గ్రామస్తులందరూ దుర్గాదేవికి కొబ్బరికాయ కొట్టి పూజలు చేశారు. పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వం వస్తేనే అర్హులందరికీ అన్ని సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఎంపీపీతో పాటు నాయకులు ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ సత్తమ్మ, పలువురు మహిళలు పాల్గొన్నారు.



ఆవుడంలో దుర్గాదేవికి మొక్కులు చెల్లిస్తున్న ఎంపీపీ,గ్రామస్తులు